


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (36)

**మరో దేవుడు**

శ్రీమతి ఏదో చెప్పబోయింది. కానీ ఏడుపు తన్నుకు రాగా వెక్కి వెక్కి ఏడ్చింది.

నా దగ్గరైతే ఎమోషన్స్‌ని దాచుకోదు కానీ, బయటవాళ్ల దగ్గర ఎమోషన్స్ విషయంలో చాలా నిగ్రహం పాటిస్తుంది శ్రీమతి.

ఆమె అంతలా బ్రేక్ ఐపోతుందని ఊహించని నాకు ఎంత ఆశ్చర్యం కలిగిందంటే, ఒక్క క్షణం బాబు విషయం కూడా మర్చిపోయాను.

స్వల్పపరిచయంలోనే రావుగారు మాకంత ఆత్మీయులైపోవడం కూడా ఓ కారణం కావచ్చు !

"ఆవిడ చెప్పే స్టేజిలో లేరు" అంటూ సత్యవతిగారు ఆయనకి బాబు విషయం చెప్పింది.

"అయ్యో!" అన్నాడు రావుగారు వెంటనే.

ఆయన శ్రీమతిని ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు. ఆమె తేరుకునేలోగా బాబు దగ్గరికెళ్లారు.

సోఫాలో కదలకుండా పడుకున్న వాణ్ణి పరీక్షగా చూశారు.

బాబు రావుగార్ని చూశాడు. ఆయనలో తనకీ ఆత్మీయుడు కనిపించాడేమో, జాలిగా ముఖం పెట్టాడు.

రావుగారు వాణ్ణి తాకలేదు. చూపులతోనే అన్నీ గ్రహించేసినట్లు తల తాటించాడు. తర్వాత శ్రీమతివైపు తిరిగి, తనే డాక్టరైనట్లు, "అబ్బే, కంగారు పడాల్సిందేం లేదండీ" అన్నాడు నెమ్మదిగా.

అప్పటికి శ్రీమతి కొంచెం తేరుకుంది. ఏడ్పు ఆపుకోలేనందుకు మొహమాటపడుతూ, చీరచెంగుతో మొహం తుడుచుకుని, సత్యవతి గారితో, "ఆయనకి కాఫీ..." అంది.

"దాన్ని కాఫీ అనలేను కానీ, ఆ పేరున్నదే ఆఫీసులో ఆటోమాట్లో తాగే వచ్చాన్లెండి. మనమిప్పుడు వెంటనే హాస్పిటలుకి బయల్దేరుదాం" అని నావైపు తిరిగి, "ఇన్సూరెన్సు పేపర్లు తెచ్చారా?" అన్నారు.

అహమ్మద్ చెప్పడం మంచిదే అయింది– అనుకుంటూ– నేనాయనకు వెంటనే బాబు పేరిట ఉన్నచెక్కు పుస్తకం ఇచ్చాను, ఆయన అది చూస్తూంటే, "ఇక్కడ ప్రొసీజర్సు ఎలా ఉంటాయో తెలియదు. దగ్గర ఎంత క్యాషుంచుకోవాలో తెలియదు. ఇప్పటికి నా దగ్గర ఎక్కువ క్యాష్ లేదు..." అని ఏదో చెప్పబోయాను.

"క్యాష్ దేనికీ, కారులో పెట్రోలు ఫుల్ టాంక్" అని నవ్వి, నేనిచ్చిన పుస్తకాన్ని కోటు జేబులోకి తోసేడాయన.

డబ్బులు పెట్రోలుకోసం మాత్రమేనా?

అది సెన్సాఫ్ హ్యూమరో, డబ్బు విషయంలో నాకు ధైర్యం చెప్పడమో తెలియలేదు.

నేనింకా ఏదో అనబోతే, ఆయన శ్రీమతి వైపు తిరిగి, "బాబుని కారు సీట్లో కాదు, చెయ్యి కదలకుండా జాగ్రత్తగా వళ్లో పడుకోబెట్టుకోవాలి అందుకు తగిన సున్నితం మీవారికుంటే సరే..." అని ఆగారు.

హాస్పిటలుకి తనకీ రావాలనుందేమోనన్న ఉద్దేశ్యంతో ఆయన ఆఫర్లాంటి హింటొకటిచ్చారు.

కానీ కార్లో మేమిద్దరం వెడితే, పాపని కూడా తీసుకెళ్లాలి. బాబు పరిస్థితి మామూలుగా ఉంటే అదేమంత సమస్య కాదు. కానీ ఇప్పుడు వాడి చేతికి నొప్పి కలక్కూడదంటే, వెనక సీట్లో వాడూ, శ్రీమతీ మాత్రమే ఉండాలి. మరో మనిషుంటే ఇరుకై వాడికి ఇబ్బంది ఔతుంది.

పోనీ పాపని సత్యవతిగారి వద్ద వదిలి వెడదామా అంటే, అటు ఆమెకీ, ఇటు పాపకీ కూడా కొంచెం ఇబ్బందే!

నేను సున్నితమైనా, కాకపోయినా– అలాంటి పరిస్థితుల్లో బాబుని నాకు వదలదు శ్రీమతి. కానీ ఇది దేశం కాని దేశం. మాట్లాడేది వంటబట్టని భాష. ఆపైన వెడుతున్నది హాస్పిటలు. రావుగారు ఎంత ఆత్మీయులైనా, ఈ సమయంలో పక్కన భర్త ఉంటేనే తనకి ధైర్యం.

శ్రీమతి కూడా ఇల్లాగే ఆలోచిస్తూ ఏంచెప్పాలో తెలియక సతమతమౌతున్నట్లుంది. నేను మాత్రం ఆమెనే ఆత్రుతగా చూస్తున్నాను.

అంతలో సత్యవతిగారు, "హాస్పిటల్లో ఆవిడ అవసరమేముంది? ఐనా ఇదేమైనా గంటలకు గంటలు పట్టే పనా? ఇలావెళ్లి అలా వచ్చేసేదానికి, మగాళ్లిద్దరూ వెళ్లండి చాలు. ఇక్కడ మాకు మాట్లాడుకోవాల్సిన విశేషాలు చాలా ఉన్నాయి" అంది.

పరిస్థితికి అనుకూలంగా త్వరిత నిర్ణయాలు తీసుకోవడానికి చొరవ ఉండాలి. ఆ చొరవలోనే, భయపడుతున్నవారికి ధైర్యం చెప్పాలి. ఆ మెలకువలు, సత్యవతిగారు ఉగ్గుపాలతోనే నేర్చినట్లు నాకు అనిపించింది.

రావుగారు నవ్వేసి, "నాకు తెలుసు. ఆవిడకేమో, ఆయన సున్నితమని ఒప్పుకోవడం ఇష్టం లేదు. నీకేమో– ఆవిడకి నామీద చెప్పాల్సినవి చాలా ఉన్నాయ్. ఇంతవరకూ ఆవిడ నీకు ఒంటరిగా దొరకలేదుగా, ఈ ఛాన్సెక్కడ పోతుందోనని నీ భయం" అన్నారు.

"మీరు మరీనూ" అంది సత్యవతిగారు.

"నేనెంత మరీనో కానీ, ఇప్పుడు నువ్వావిడకి చెప్పబోయేవే మరీనూ అని నాకు తెలుసు" అని శ్రీమతివైపు తిరిగి, "మీరు తను చెప్పేవన్నీ నమ్మెయ్యకండి. తను మరీ ఎక్కువ చెబితే, 'మీరు పుట్టింటికెళ్లడానికి ఇష్టపడరుట ఎందుకూ?' అని

ఒకే ఒక్క ప్రశ్న అడగండి. చాలు. తన వాక్ప్రవాహానికి అడ్డుకట్ట పడిపోతుంది. ఎందుకంటే, రాముడు మంచి బాలుడు– అంటారే అదీ నేను. మా పెద్దవాళ్లు నాకు సత్యనారాయణ పేరెట్టారు కానీ, శ్రీరామచంద్రుడని పేరెట్టాల్సిందని మా అత్తారింట్లో అనుకుంటారు. నా గురించిన పొగడ్తలు వినలేకే, మా ఆవిడ పుట్టింటికెళ్లడానికి ఎక్కువ ఇష్టపడదు" అన్నాడు రావుగారు.

శ్రీమతి కిసుక్కున నవ్వింది. వాతావరణం తేలిక కావడంతో తన మనోభారమూ తగ్గిందని అర్థమై, నా మనసూ తేలికైంది.

అప్పుడు శ్రీమతి వాణ్ణి జాగ్రత్తగా ఎత్తుకుంది. వాడు వెంటనే బేరుమన్నాడు. చెయ్యి కదిలిందేమోనని భయపడ్డాను కానీ, కారణం అది కాదు. తల్లి కదా, వాడికి ఏమాత్రం నొప్పి తెలియకుండానే ఎత్తుకుంది. వాడు భయంకొద్దీ ఏడ్చాడంతే!

నేను, శ్రీమతి, రావుగారు లిఫ్టులో కిందకెళ్లాం. కార్లో కూర్చున్నాక, శ్రీమతి బాబుని జాగ్రత్తగా నా వళ్లో పడుకోబెట్టింది.

"నువ్వు ఏడవకూడదోయ్! ఏడిస్తే మీ అమ్మ బెదిరిపోతుంది. మీ నాన్న పరువు పోతుంది" అన్నాడు రావుగారు.

ఏమర్థమయిందో– ఆ తర్వాత బాబు మరి ఏడవలేదు.

హాస్పిటలు మరీ దూరం కాదు. బెర్లిన్ వంటి మహానగరం మధ్యలో అడుగడుగునా ట్రాఫిక్ అడ్డు తగిలినా కూడా– చేరుకుందుకు అరగంట కూడా పట్టలేదు.

రావుగారు ముందు రిసెప్షన్లోకెళ్లి ఏదో మాట్లాడేరు. తర్వాత నన్ను తీసుకుని ఆర్థోపెడిక్ వార్డుకి తీసుకెళ్లారు. అక్కడో డాక్టరు బాబు చేతిని పరీక్షించాడు.

కొత్త వాతావరణం. చెయ్యి నొప్పి. పసి వయసు. అమ్మ పక్కన లేదు. అందుకని బాబుకి దుఃఖమొస్తోంది. కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

వాడు పళ్ల బిగువున ఏడుపు ఆపుకోవడాన్ని గమనించాను. వాడిమీద జాలి పొంగుకొచ్చింది. ఐతే ఆ వయసుకి అంత హుందాగా ఉండడం ఆశ్చర్యంగానూ అనిపించింది.

డాక్టరు కూడా చాలా సున్నితంగా డీల్ చేశాడు. ఆయన చెయ్యి తాకినప్పుడు కూడా వాడు ఏడవలేదు.

ఎక్సురే తియ్యాలన్నారు.

ఇండియాలో అనుభవాన్నిబట్టి ఎక్సురే రిపోర్టు వచ్చేసరికే రెండు గంటలు కావచ్చనుకున్నాను. కానీ అన్నీ క్షణాలమీద ఐపోయాయి.

హెయిర్ లైన్ ఫ్రాక్చరుట.

చిన్నపిల్లాడు కాబట్టి దానంతటదే అతుక్కుపోతుంది కానీ, ఆడుకునే పిల్లాడు కాబట్టి, జాగ్రత్తకోసమని సిమెంటు కట్టు వెయ్యాలన్నారు. అదయ్యేసరికి దెబ్బ తగిలిన చెయ్యి మడిచి ఉంది. దానికో బ్యాండేజి. కిందకి వాలిపోకుండా ఆ చేతిని మెడనుంచి వ్రేలాడేలా చేశారు.

బాబు ఆ కట్టు ఆరు వారాలు ఉంచుకోవాలి. ప్రతి రెండు వారాలకీ కట్టు మారుస్తారు.

వాడినా పరిస్థితిలో చూడగానే నాకు మనసేదోలాగైపోయి– కళ్లలో నీళ్లు తిరిగాయి. డాక్టరు మాత్రం ఆ వయసులో అంతలా కోఆపరేట్ చేసే పేషంట్లు అరుదని మా వాణ్ణి తెగ మెచ్చుకున్నాడు. దాంతో అవే ఆనందబాష్పాలయ్యాయి.

బాబు కట్టుని పదేపదే వింతగా చూసుకుంటున్నాడు.

నొప్పి తెలియకుండా పోయినట్లుంది, ముఖంలో కొత్త ఉత్సాహం కనబడుతోంది.

“ఇక పద్దు తేల్చుకొద్దాం రండి” అంటూ రావుగారు పక్కనున్న ఆఫీసు గదికి తీసుకెళ్లారు.

బాబుని ఎత్తుకోబోయాను. కానీ వాడు నా చెయ్యి విదుల్చుకుని, తనూ నడిచే వచ్చాడు.

“ఇండియాలో డబ్బు కట్టాకే వైద్యం. ఇక్కడ పద్ధతి బాగుంది” అన్నాను రావుగారితో.

“తేడా అల్లా ముందూ వెనకా, అంతే! చికిత్సకి ఇక్కడా ముక్కు పిండి, గూబ పగిలేలా వసూలు చేస్తారు డబ్బు” అన్నాడు రావుగారు.

నా గుండెల్లో రాయి పడింది. ఇంటి దగ్గరుండగా, పెట్రోలుకి తప్ప క్యాష్ అక్కర్లేదన్నట్లు మాట్లాడిన మనిషి, ఇప్పుడిలా అంటాడేమిటీ అని కంగారు పడ్డాను. రోట్లో తలెట్టి రోకటిపోటుకి వెరచి ఏం లాభం– అనుకుంటూ మేకపోతు గాంభీర్యం వహించాను.

ఆ ఆఫీసులో రావుగారు అక్కడి ఉద్యోగితో మాట్లాడేరు. తన జేబులోంచి నేనిచ్చిన ఇన్సూరెన్సు చెక్కు బుక్ తీశారు. నాచేత రెండు చెక్కులమీద సంతకం పెట్టించుకుని ఆ ఉద్యోగికిచ్చాడు.

అక్కడో ఐదు నిముషాలున్నామేమో, అంతే!

‘ఓ చెక్కు ఎక్సరేకీ, ఓ చెక్కు బ్యాండేజికీనూ. నేటికి పద్దు తేలిపోయింది” అన్నాడు రావుగారు.

“అంటే, మనమింకేం ఇవ్వక్కర్లేదా?” అన్నాను నమ్మలేక.

“ఇవ్వాల్సొచ్చేది– ఇన్సూరెన్సు లేకపోతే! ఇలాంటి ఖర్చులన్నీ ఇన్సూరెన్సులో కవర్డ్” అన్నాడు రావుగారు.

అది 1975. ఇండియాలో గవర్నమెంటు హాస్పిటలుకి వెళ్లినా, ఉచిత సదుపాయాలకి కూడా ఎవరెవరివో చేతులు తడపాల్సిన రోజులు. ఇన్సూరెన్సు లాంటివి ఉన్నా– ఖర్చయిన డబ్బులో ఎంత వెనక్కి వస్తుందో తెలియదు. దానికీ ఋజువులకై వేధించే బ్యూరియోక్రసీ.

రావుగారు చెప్పింది విన్నాక, జరిగింది కలో నిజమో తెలియలేదు.

ఇన్సూరెన్సు కంపల్సరీ అన్నారని తప్పనిసరై అన్యమనస్కంగా తీసుకున్నాను కానీ, వినియోగదారులకు ఇంత అనువుగా ఉంటుందని తెలిసేక– ఇన్సూరెన్సుని కంపల్సరీ చెసినవారిని మనసులోనే అభినందించుకున్నాను.

భారతదేశంలోనూ ఇలాంటి వ్యవస్థ ఎప్పటికొస్తుందో అని కూడా అనుకున్నాను.

రావుగారు చెక్కు బుక్ నాకిచ్చేశాడు. నాకప్పుడది వన్ మిలియన్ మార్కుల అకౌంటుకి సింహద్వారంలా అనిపించింది. గట్టిగా పట్టుకుని పాంటు జేబులోకి తోసేశాను.

బాబు మాతో నడిచొచ్చి కారెక్కాడు. మధ్యమధ్య మడిచి కట్టిన తన చేతిని చూసుకుంటున్నా– చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

ఇండియాలో కనీసం ఓ పూట ఉండి రావాల్సిన పరిస్థితి అది. మొత్తంమీద మేము హాస్పిటల్లో గంట కూడా లేము.

"జయహో జర్మనీ!" అనుకున్నాను మనసులో.

అరగంట లోగానే ఇల్లు చేరాం.

తలుపు తియ్యగానే శ్రీమతి ఆత్రుతగా బాబుని చూసింది. కానీ వాడు ఆమెని పట్టించుకోలేదు. "అక్కా!" అంటూ లోపలకు వెళ్లాడు.

అప్పటికి రావుగారబ్బాయి పడుకున్నాడు. వాళ్ల పాప ఎలాగూ చంటిది. ఎక్కువ నిద్ర పోతూనే ఉంటుంది.

పెద్దవాళ్లు కబుర్లు చెప్పుకుంటున్నారేమో, పాప తమ్ముడి రాకకోసం ఎదురుచూస్తోంది.

వాడు తన బ్యాండేజిని గొప్పగా అక్కకి చూపిస్తున్నాడు. 'నీకు లేనిదేదో నా దగ్గరుందిసుమా!' అన్న గర్వం వాడి మొహంలో కనిపిస్తోంది.

మేమూ అందరం సోఫాల్లో సెటిలయ్యాం.

అది చూసి మనసు తేలికైందేమో, "ఇంకా చాలాసేపు పడుతుందనుకున్నాను. సత్యవతిగారన్నట్లు, నిజంగానే ఇలావెళ్లి అలా వచ్చేశారు" అంది శ్రీమతి.

దానికి రావుగారు, "అయ్యో! ఇంకా చాలా తక్కువ టైం పట్టేదండీ. హాస్పిటలుకి వెళ్లేక మీవారి మొహం చూసి ఆయనే పేషంటనుకుని, ఎంత చెప్పినా వినకుండా డాక్టర్లాయనకు పరీక్షలు మొదలెట్టారు. పేషెంటు ఈయన కాదు, వీళ్లబ్బాయి అని నమ్మించడానికి, ఇంత టైం పట్టింది. ఇక మీవాడా, గుడ్ గాడ్! మీ వాడికి మీ ఇద్దరి పోలికా రాలేదు. రంగుల రాట్నం ఎక్కినంత హాపీగా, ఎక్సురే బల్లమీద కూర్చున్నాడు" అన్నాడు.

జోకు పడింది నామీద కావడంతో, మాట తప్పించాలని, "ఔను వసూ! వాడు చాలా బుద్ధిగా కట్టు కట్టించుకున్నాడు. డాక్టర్లు వాణ్ణి ఒకటే పొగిడారనుకో" అన్నాను.

రావుగారొదుల్తాడా, “మీవాడు బుద్ధిగా ఉన్న మాట నిజం. డాక్టర్లు పొగిడిన మాట అబద్ధం. ఈ ప్రపంచంలో కొడుక్కి తగిలిన ఇంత చిన్న దెబ్బకి ఇంతలా అప్సెట్టయ్యే తండ్రి ఉంటాడా– అని ఆశ్చర్యపడ్డంతోనే వాళ్లకు సరిపోతే మీవాణ్ణెక్కడ పట్టించుకుంటారు? ఇప్పుడు మళ్లీ హాస్పిటలుకెడితే ఇంకా వాళ్లు మీవారి గురించే మాట్లాడుకుంటుంటారని ఢంకా బజాయించి చెప్పగలను” అన్నాడు.

అప్పుడు సత్యవతిగారు కలగజేసుకుని, “కొడుక్కి చెయ్యి విరిగితే ఏ తండ్రికి దుఃఖం రాదు? దానికి వాళ్లంత ఆశ్చర్యపోయుండరు కానీ, ఇక ఆపుతారా?” అంది.

“నిజమే, బాగానే పట్టేశావ్– వాళ్లు అంత ఆశ్చర్యపోలేదు కానీ, నేను వాళ్లతో– ‘ఇంకా నయం, మీరు తండ్రిని చూశారు. తల్లిని చూసుంటే, ఈయందీ ఓ దుఃఖమేనా, అనుకుని ఉండేవారు’ అన్నాను. అదీ వాళ్ల అసలు ఆశ్చర్యానికి కారణం” అన్నాడు రావుగారు.

ఆ మాట వినగానే శ్రీమతి సిగ్గుపడింది. తడబడింది. “సారీ, మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాను” అంది మొహమాటంగా.

“మీవల్ల ఇబ్బందని అనుకున్నారా? ఐతే మీకో విషయం చెప్పాలి. చిన్నప్పుడు నేనోసారి మా ఇంట్లోనే కాలు జారి పడ్డాను. ఎక్కడా కనీసం గీరుకోనైనా లేదు. కానీ సానుభూతికోసం పెద్దగా ఏడ్చాను. కానీ ఆ ఏడుపు ఒక్క క్షణమే! ఎందుకంటే, మరుక్షణంలోనే నాకేదో ఐపోయిందని మా అమ్మ రాగం మొదలెట్టింది. ఎంత పెద్దగా ఏడ్చిందంటే, నేను భయపడి ఏడుపాపేసి అమ్మనే చూస్తూండిపోయాను. అదండీ అమ్మంటే! బిడ్డకు కష్టమొచ్చిందంటే, అదెంత చిన్నదైనా సరే, దాన్ని పదింతలు చేసి తను అనుభవిస్తుంది. మిమ్మల్ని చూడగానే నాకు మా అమ్మ గుర్తుకొచ్చింది” అన్నాడాయన.

“ఎంత ఉదాత్తంగానూ, ఆహ్లాదంగానూ చెప్పారో!” అనుకుంటూ– “మీ అమ్మమీదా ఇలాగే జోకులేసేవారా?” అన్నాను అప్రయత్నంగా.

రావుగారు తల అడ్డంగా ఊపి, “మా అమ్మయితే నాకంటే చాలా పెద్దదానిలా అనిపించేది. అందుకని తనమీద జోకులేసే ధైర్యం ఉండేది కాదు. మీ శ్రీమతిగారిలో అమ్మ కనిపించగానే, అమ్మ మరీ ఇంత చిన్నదైపోయిందా అనిపించింది. జోకేసి వెంటనే సరదా తీర్చేసుకున్నాను” అన్నాడు.

రావుగారు హాస్యప్రియుడు. హాస్యచతురుడు.

నా శ్రీమతిని– ‘మీరు’ అని మన్నిస్తూనే– చిన్నపిల్లలా ఫీలవుతూ, ఆత్మీయంగా ముచ్చటపడ్డం ఆయనకిది మొదటిసారి కాదు.

"పరిస్థితి ఎంత గంభీరంగా ఉన్నా సరే, ముందు దాన్ని తేలిక చేసి, అప్పుడు డీల్ చెయ్యాలంటారు మావారు. అప్పుడప్పుడు రెచ్చిపోయినట్లు అనిపించినా, అదే కరెక్టనిపించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి" అంది సత్యవతిగారు గొప్పగా.

నిజమే మరి. బాబుకి తగిలింది చిన్న దెబ్బయినా, అదే తొలి అనుభవం కావడంవల్ల– మిన్ను విరిగి మీద పడ్డ అనుభూతిలో ఉన్నాం. ఆయన మాటలతో అక్కడ వాతావరణంలోని గాంభీర్యం తొలగింది. ఆహ్లాదం పుట్టింది. మా మనసులు తేలికపడ్డాయి.

రావుగారింకా రెచ్చిపోయే మూడ్ నుంచి బయటపడలేదు, "నేను లేనప్పుడు ఇందాకా చెప్పిందే, అవేం నమ్మకండి. ఇప్పుడు చెప్పిందే నమ్మండి" అన్నాడు.

అప్పటికి శ్రీమతి పూర్తిగా ఫ్రీ అయింది, "సరేలెండి. ఆవిడ మిమ్మల్ని దేవుడన్నారు. కాదనుకుందుకు మనసొప్పకపోయినా, మీరే నమ్మొద్దంటే ఏంచెయ్యాలి?" అంది.

రావుగారు ఉలిక్కిపడి, "అమ్మో! మీరు మామూలైపోయారు. నేనిక జాగ్రత్తగా మాట్లాడాలి" అన్నారు.

"పెద్దగా ఏంచెయ్యను కానీ, కాస్త చారూ అన్నమే మనమంతా కలిసి భోంచేద్దాం" అంటూ సత్యవతిగారు ఆ ఏర్పాట్లకు లేచింది.

శ్రీమతి వెంటనే, "ఇంట్లో అన్నీ రెడీగా ఉన్నాయి...." అంది.

"రెడీగా ఉన్నవి వేడిగా ఉండవు. ఆ మాట చెప్పండీ" అంది సత్యవతిగారు భర్తవంక చూస్తూ.

రావుగారు మమ్మల్ని మొహమాటపెట్టేలోగా, "హాస్పిటల్నించి తిరిగొచ్చేసరికి ఏ అర్ధరాత్రో కావచ్చని భయపడ్డాను. మా బిల్డింగ్ గేటు పదకొండుకల్లా మూసేస్తారు. ఒలోముచ్‌కీకి ముందుగా చెప్పడం అవలేదు. చెప్పినా ఆవిడకి గుర్తుంటుందన్న గ్యారంటీ లేదు. ఎలాగా అని భయపడ్డాను. అదృష్టంకొద్దీ పెందరాళే పనులైపోయాయి. మేమిక వెళ్లిపోతాం. మీ ఇంట్లో తినేది చారూ అన్నమే ఐనా, కబుర్లతో కాలం తెలియదు. ఏమనుకోవద్దు. ఇక మాకు సెలవు" అన్నాను.

నా నిర్ణయంలోని దృఢత్వం కనిపెట్టారేమో, రావుగారు ఒప్పుకున్నారు.

ఆయన మమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతానంటే, "మీరేమో ఆఫీసునుంచి వస్తూనే హాస్పిటలుకి ప్రయాణమయ్యారు. నా బాధ్యతని మీరే తీసుకుని, మావాడికి వైద్యం జరిపించారు. జీవితంలో మర్చిపోలేని ఉపకారమిది. కాసేపు విశ్రాంతి తీసుకోండి. రిలాక్సవ్వండి. నేను మీరనుకున్నంత సున్నితం కాదు. ఎలా వచ్చామో అలా వెళ్లిపోగలమని ఋజువు చేసుకోవాలిగా" అన్నాను.

"అది మరోసారి బుజువు చేసుకుందురుగాని. ఇప్పుడు కానీ మిమ్మల్ని ఇంటిదగ్గర దిగబెట్టకపోతే, ముందు మా ఆవిడూరుకోదు" అన్నాడాయన.

ఇలాంటి డైలాగ్సు విశాఖలో, భువనేశ్వర్లో విన్నాను. బెర్లిన్లో కూడా వినిపించి, ఇది మనూరే సుమా అనిపింపజేసిన రావుగారికి మనసులో మరోసారి ధన్యవాదాలర్పించుకుని, "ఆవిడకి నచ్చజెప్పడం మీ బాధ్యత. మా అబ్బాయి తన చేతి కట్టుని బెర్లిన్ అంతా చూడాలని తహతహలాడిపోతున్నాడు. వాడి కోరిక తీర్చడం మా బాధ్యత. మమ్మల్ని మాకులాగే వెళ్లనివ్వండి. మావి తిట్టే నోళ్లు కావు కానీ, తిరిగే కాళ్లని మీకు తెలుసుగా. మా బాబుకి కట్టు కట్టేక ట్రయల్సు ఇప్పట్నించే మొదలనుకోండి" అన్నాను.

ఆ దంపతులనుంచి సెలవు తీసుకుని, ఇంట్లోంచి బయటపడ్డాం.

దగ్గర్లోనే ఉన్న ఊబాన్‌హాఫ్ చేరాం. మామూలుగానే ప్రయాణం చేసి, ఇల్లు చేరాం.

భరించలేని నొప్పినుంచి బయటపడ్డంవల్లనేమో బాబు చాలా హుషారుగా ఉన్నాడు. రోడ్డుమీద ఒకరిద్దరు వాడివంక జాలిగా చూస్తే వాడి మొహంలో కించిత్ గర్వం. పాప మొహంలో రవంత అసూయ.

ఇల్లు చేరి సెటిలయ్యేక, "నిన్నెప్పుడూ అంత ఎమోషనలుగా చూడక, నేనే ఆశ్చర్యపోయాను. రావుగారలా అనడంలో ఆశ్చర్యమేముంది? నువ్వు గానీ ఆయన మాటలకు ఫీలయ్యేవా?" అన్నాను.

చప్పున రెస్పాండయింది శ్రీమతి. "ఆయన మాటలకి ఫీలవడమా? వయసుని బట్టి పెద్దన్న అనిపించినా, ఆయన్ని చూస్తే అప్పుడప్పుడు మా నాన్నగారు కూడా గుర్తొస్తుంటారు నాకు. నాలో అమ్మని చూశానన్నారే, ఆ మాట చాలండీ ఆత్మీయతకి" అంది.

"ఆయన నిన్ను అమ్మ అన్నారు. నువ్వాయన్ని నాన్న అని పగ తీర్చేసుకుంటున్నావా?" అన్నాను నవ్వుతూ.

శ్రీమతి, 'హవ్వ' అన్నట్లు నోరు నొక్కుకుని, "ఆయన మీద పగా? ఎవరికైనా దేవుడిమీద పగుంటుందా?" అంది వెంటనే.

ఔను. ఆ రోజుకి మాకు రాముడూ, రహీమూ, కృష్ణుడూ, క్రీస్తూ, సాయిబాబా– వీళ్లెవరూ కాదు. రావుగారే దేవుడు.

ఐతే మర్నాటినుంచి– యశోదకి కృష్ణుడిలా ఆయన మళ్లీ మనిషే మాకు. ఎందుకంటే కృష్ణుణ్ణి మనిషిలా భావించినవారే ఆయన సాహచర్యంలో ఎక్కువ ఆనందం పొందారు.

రావుగార్ని స్నేహితుడిగా భావించడంవల్లనే, జర్మనీలో గడిపిన మిగతా రోజులన్నీ మరింత రసవత్తరమయ్యాయి, మరపురాని మరువలేని ఆయన బహుముఖప్రజ్ఞాలీలలు ఎంతో ఆహ్లాదాన్నిచ్చాయి. ఇప్పుడు మనం స్మరించబోయేది వాటినే.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS